# కన్నీటి చినుకు

పాముగోటి కృష్ణారెడ్డి

"రాముా... రాముా... నిద్ర లేమ్మా...' వర్షం వస్తోంది." శాంతమ్మ రెండు మూడు సార్లు తట్టి లేప గానే లేచి కూర్చున్నాడు రాము.

రోజూ తెల్లవారుఝామున రెండు బాదులు బాది రాముని నిద్రలేపేవాడు అతని తండ్రి, చదివించడం కోసం. రోజూ భయంగా, తత్తర పాటులో, ఆందోళనగా, అసహనంగా నిద్రలేచే రాము ఈ రోజు ప్రశాంతంగా నిద్రలేచి కూర్చుని, కళ్ళు నులుముకుంటూ చూశాడు. ఎదురుగా తల్లి నిలబడి వుంది.

"త్వరగా లేమ్మా రాముా, వర్షం వస్తోంది" ఆ మాట వినగానే నిద్రమత్తు వదిలిపోయింది.

ఎక్కడ లేని ఉత్సాహం వచ్చింది. ఆనం దంగా ముఖం అటుకేసి తిప్పాడు. పడుతున్న చినుకుల్ని చూడగానే ముఖం వెలిగిపోయింది. చెంగున మంచం మీద నుంచి దూకాడు. నిక్కరు సవరించుకుని, చొక్కా గుండీలు పెట్టుకుని వసారాలో నిలబడ్డాడు వర్షాన్ని చూస్తూ.

"రాముా ఎక్కడికీ వెళ్ళకు, వర్షం పెద్దది అవుతుందేమో! ఇవన్నీ సర్ది గిన్నెలు పెట్టాలి" అంది తల్లి లోపలి నుంచి.

రాముా ఉత్సాహం నీరుకారి పోయింది. వాడలా నిరుత్సాహపడటం అది మొదటిసారి కాదు. ఊహ తెలిసినప్పటి నుంచీ నిరుత్సాహ పడుతూనే వున్నాడు.

ఈ రోజు ఎందుకనో వర్షాన్ని చూడగానే చాలా ఆనందపడ్డాడు. బహుశా దానికి కారణం తండ్రి ఇంటి దగ్గర లేకపోవడం ఏమో!

నిద్ర లేవగానే తండ్రి కనపడలేదు. ఇంత ఉదయాన్నే ఎక్కడికి వెళ్ళాడో! అమ్మని అడుగుదామని లోపలికి తొంగి చూశాడు. ఆమె సామాన్లు సర్దుకుంటోంది. 'వర్షం ఇంకొంచం పెద్దది అయితే ఇల్లంతా కురుస్తుంది కదా! ముందుగా జాగ్రత్తపడుతోంది. ఇప్పుడు పలక తీస్తే అవన్నీ సర్దమంటుంది తనను కూడా! నాన్న వుంటే ఎలాగూ తప్పదు ఈ పని వర్షం వచ్చినప్పుడల్లా. ఈ రోజు ఈ పని నుంచి తప్పించుకోవాలి' అనుకొని తల్లికి కనిపించ కుండా వుండటానికి, వాకిలికి ఎదురుగా నిలబడి వున్నవాడల్లా కొంచం ప్రక్కకు జరిగాడు.

వర్షం పెద్దదయింది.

నీళ్ళు చిన్నగా పారుతున్నాయి. ఇప్పటికే వీధి చివర దేవాలయం ముందు నీళ్ళు కాలువలా పారుతుంటాయి! తన స్నేహితులంతా కాగితపు పడవల్తో ఆడుకుంటూ వుంటారు, చిన్న కాలవ లకి అడ్డంగా కట్టకడుతూ వుంటారు! నీళ్ళల్లో గంతులేస్తూ వుండి వుంటారు. ఇవన్నీ తనకు ఊహ తెలిసినప్పటి నుంచి తీరని కోరికలుగానే మిగిలిపోయాయి.

వాళ్ళు ఎలా ఆడుకున్నది, ఏమేమి ఆటలు ఆడుకున్నది, స్కూలుకు వెళ్ళాక చెబుతారు. వాళ్ళు చెబుతూ వుంటే నోరు తెరుచుకుని, దిగులుగా వినడం తప్ప తనను వెళ్ళ నివ్వడు నాన్న. స్కూలులో వుండగా వర్షం వస్తే టీచర్లు ఎవర్నీ ఇళ్ళకు వెళ్ళ నివ్వరు. ఒక వేళ వెళ్ళ నిచ్చినా, నేరుగా ఇంటికి రాకుండా వర్షంలో ఆడుకుంటే ఒళ్ళు పగలగొడతాడు నాన్న. వర్షం వచ్చిందంటే తను ఇంట్లో వుండాల్సిందే. వర్షంలో తడుస్తానని కాదు ఆయన బాధ. ఇంట్లో సామాన్లు సర్దాలి. ఇంట్లో అంటే పెద్ద ఇల్లని కాదు. చిన్న పూరిపాక. ఒక గది, దాని ముందు వసారా.

అంతా కురుస్తుంది.

కప్పు కప్పి ఎన్నిసంవత్సరాలయిందో! తనకు ఊహ తెలియక ముందునుంచి ఆ ఇంట్లోనే వుంటున్నారు. తనిప్పుడు ఐదవ తరగతి. వర్షం కురిసినప్పుడల్లా నాన్నతో చెబుతుంది అమ్మ.

'ఇంటి ఆయనకి చెప్పండి. కాస్త కప్పు మార్పించమని'

మౌనంగా వింటాడు తండ్రి

'మాట్లాడరేమండి'

'నువ్వు నోరుమూసుకో! నాకు తెలుసు. ఇప్పుడు ఇంటి కప్పు మార్పించమంటే వాడికేం! కావాల్సినంత డబ్బుంది. రెండు రోజుల్లో మార్పి స్తాడు. అద్దె పెంచుతాడు. మనం ఇప్పుడు ఎంతిస్తున్నాం? మనం ఇచ్చే అరవై రూపాయి లకు ఎక్కడన్నా అసలు ఇల్లు దొరుకుతుందా? ఈ ఇల్లయినా కప్పు మార్పించాడంటే వందన్నా చేస్తాడు, ఎంత లేదనుకున్నా. అప్పుడు మనం కాదంటే ఎవడైనా వచ్చి వుంటాడు. మనం వేరే ఇల్లు వెతుక్కోలేక చావాలి. సంపాదించేవాడికి తెలుస్తాయే బాధలన్నీ.

అయినా ఇప్పుడేం తక్కువయిందనీ? వర్షం పడ్డ రోజు కాస్త సర్దుకోవడానికి బాధగా వుందా?... ఏం, మేడల్లో పుట్టి పెరిగావా?...' వెక్కిరింపుగా, వ్యంగ్యంగా మాట్లాడుతాడు తండ్రి.

తల్లి ఎదురు మాట్లాడదు. ఇంకా ఎక్కువగా వ్యంగ్యంగామాట్లాడితే ప్రక్కకు తిరిగి కళ్ళ నీళ్ళు పెట్టుకుంటుంది.

'తను ఏమన్నా మాట్లాడితే ఒళ్ళు హూనం అవుతుంది కాబట్టే ఎదురు మాట్లాడదు తను' ఇలా ఊహలతోనే చాలా సమయం గడిచింది రాముకు.

వర్షం పెద్దదయింది.

తల్లి పిలిచింది రాముని.

లోపలికి వెళ్ళాడు.

అప్పటికే ఆమె వున్న సామానులన్నీ ఒక వైపుకు సర్ది వాటి మీద గోనె సంచులు కప్పింది. వాటి మీద చిన్న ధారగా వర్షం కురుస్తోంది. మళ్ళీ

అవన్నీ కాస్త పొడిగా ఉన్న చోటుకు సర్దుతోంది. ఆమె, రాముని చూసి

"రాముా, ఇవన్నీ నేను సర్దుతాలేగాని ఇల్లంతా నీళ్ళు నిలవకుండా ఆ ధారకు ఇగా కురిసే

చోట గిన్నెలు పెట్టు" అంది.

అలవాటైన తతంగమే కాబట్టి చకచకా ఇంట్లో వున్న కుండల్ని, పళ్ళాల్ని, గిన్నెల్ని వీలైన చోటల్లా పెట్టేశాడు.

కొన్నిసార్లు పాత్రలు మిగిలిపోతున్నాయి.

కొన్నిసార్లు ఇంకొన్నిచోట్ల వర్షపుధారలు హెచ్చింపవుతున్నాయి. మొత్తం మీద ఇల్లంతా తడిసిపోతోంది. శాంతమ్మ బాధపడుతోంది. రాము తొందరపడుతున్నాడు.

త్వరగా వర్షం తగ్గితే, నాన్న లేడు కాబట్టి వెళ్ళి వీధి చివర దేవాలయం దగ్గర ఆడుకోవచ్చు! తన స్నేహితులంతా అక్కడే వుంటారు.

తల్లికి వేగంగా సాయం చేశాడు. పొయ్యి, కట్టెలు తడవకుండా చూడటానికి నానా యాతన పడుతోంది ఆమె.

నిండిన పాత్రల్లో నీళ్ళు బయటపోస్తున్నాడు రాము.

వర్షం తగ్గుముఖం పట్టింది.

పాత్రల్లో నీళ్ళు బయటపోస్తుంటే వీధిన పరుగెడుతున్న రాము స్నేహితుడు చెప్పాడు.

"ఆకాశంలో ఇంద్రధనుస్సు కనిపిస్తోందిరా, రా చూద్దువుగాని" అంటూ పరుగెత్తాడు వాడు.

రాము మనసు ఇక నిలవలేదు.

ఇంద్రధనుస్సు గురించి మాస్టారు చెబితే విన్నాడు.

క్లాసు పాఠంలో చదివాడు.

కాని ఆకాశంలో చూడలేదు.

ఈ రోజు పోతే మళ్ళీ అవకాశం రాదు.

నాన్న లేడు.

అమ్మ, ఒక వేళ కోపం వస్తే ఒక మాట అంటుంది గాని కొట్టదు.


ఇంట్లోకి వెళితే పాత్రల్లో నీళ్ళు పారబోయమంటుంది. వర్షం తగ్గింది గదా! ఆ పని ఎప్పుడైనా చేసుకోవచ్చు' అనుకున్నాడు.

చేతిలో గిన్నె వసారాలో పడేసి వీధిలోకి పరుగెత్తాడు. ఇళ్ళు అడ్డం వుండటం వల్ల ఇంద్రధనుస్సు కనిపించలేదు. వీధి చివరిదాకా పరుగెత్తాడు.

అక్కడ స్నేహితులు, ఇంకా ఇతర పిల్లలంతా కేరింతలు కొడుతూ ఆకాశం కేసి చూస్తున్నారు.

అక్కడ కొంచెం ఎండ కూడా వున్నట్లుంది. పిల్లలు పెద్దగా కేకలు పెడుతూ,

"ఎండా, వానా కుక్కల, నక్కల పెళ్ళిళ్ళోచ్..." అంటూ పెద్దగా అరుస్తున్నారు.




రాము ఆనందానికి అవధుల్లేవు. వీలైతే ఒక్క అంగలో వాళ్ళ దగ్గరకు దూకి ఆ ఆనందాన్ని త్వరగా వాళ్ళతో పంచుకోవాలన్న ఆరాటం.

ఇంక ఒక్క ఇల్లు దాటితే మైదానం. స్నేహితులు, ఎండ-వాన, నీళ్ళు, కాగితపు పడవలు, ఇంద్రధనుస్సు.

రాముకు - ఆ అనుభవాలకు, అదృష్టాలకు మధ్య ఒక్క క్షణ కాలం తేడా!

ఆ క్షణకాలంలోనే అకాల దర్శనమిచ్చాడు. రాము తండ్రి.

ఎక్కడికి వెళ్ళాడో! అప్పుడే ఇంటికి తిరిగి వస్తున్నాడు.

తండ్రిని చూసి ఠకీమని ఆగిపోయాడు రాము.

"ఎక్కడికిరా వెళుతున్నావ్?" గద్దించి అడిగాడు. నీళ్ళు నమిలాడు రాము.

"పద ఇంటికి" రంకె వేసినట్లుగా చెప్పాడు. వెనుతిరిగాడు రాము.

వాడి కళ్ళ నిండా నీళ్ళు. ఒక్కో బొట్టు పడుతోంది వర్షంలా.

ఇంటికి తిరిగి వచ్చారిద్దరూ. ఇంట్లో కొచ్చి తేరిపార చూశాడు ఆయన. పాత్రల్లో నీళ్ళు నిండి పొర్లిపోతున్నాయి.

"నీళ్ళు పారబొయ్యకుండా షికార్లు కొడుతున్నావా?" కోపంగా రాము మీదికి దూకి గూబ పగిలిపోయేలా చెంపదెబ్బ కొట్టాడు.

వాడికి తల తిరిగిపోయింది.